క్లుప్తంగా

17న ధర్నా

నల్లగొండ టౌన్: సంక్షేమ బోర్డును ప్రైవేట్ రంగానికి అప్పజెప్పాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 17న హైదరాబాద్‌లో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కార్మికులు అధిక సంఖ్యలో ధర్నాలో పాల్గొనాలని పిలుపునిచ్చారు.

రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



రేణుకా ఎల్లమ్మ అమ్మవారు

కనగల్: దర్వేశిపురం శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో అమ్మవారిని ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో అర్చకులు అలంకరించారు. మహిళలు బోనాలతో వచ్చి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారికి పసుపు కుంకుమలతో భక్తులు అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వాటర్ ప్లాంట్‌కు స్థలం వితరణ

కట్టంగూర్ : ఫాదర్స్ డే సందర్భంగా కట్టంగూర్ మండలంలోని పందెనపల్లి గ్రామానికి చెందిన అన్నదమ్ములు కుంభం విజయ్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి తమ తండ్రి భద్రారెడ్డి జ్ఞాపకార్థం పందెనపల్లి రెడ్డి అసోసియేషన్ ఆధ్వర్యంలో వాటర్ ప్లాంట్ ఏర్పాటుకు ఆదివారం 26 చదరపు గజాల ప్లాట్‌ను ఇచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి కేవీపీఎస్ శిక్షణ తరగతులు



పోస్టర్‌లను విడుదల చేస్తున్న నాయకులు

చిట్యాల: కట్టంగూర్‌లో ఈ నెల 22, 23వ తేదీల్లో జరగనున్న కేవీపీఎస్ జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వట్టె పాక కృష్ణ కోరారు. చిట్యాలలో ఆదివారం కేవీపీఎస్ శిక్షణ తరగతుల ప్రచార కరపత్రాలను ఆయన విడుదల చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు జిట్ట నగేష్, కేవీపీఎస్ జిల్లా కమిటీ సభ్యుడు బొడ్డు బాబురావు, గాదె ఎల్లేష్, బారల యాదగిరి, పాల రమేష్, బీంపాక నర్సింహ, బోడ రాజేష్ పాల్గొన్నారు.

దైద రవీందర్‌కు సన్మానం



దైద రవీందర్‌ను సన్మానిస్తున్న నాయకులు

కేతేపల్లి: టీ పీసీసీ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన దైద రవీందర్‌ను ఆదివారం కేతేపల్లి మండలంలోని బండపాలెం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్ నేతలు సన్మానించారు. దైద రవీందర్‌కు శాలువాలు కప్పి పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో బండపాలెం మాజీ సర్పంచ్ వంగూరి రాము, నాయకులు గుర్రం కోటేష్, వంగూరి ప్రసాద్, నకిరెకంటి అనిల్, పడిదల మురళి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న కటకం నర్సింగ్‌రావు

మర్రిగూడ: బీసీలు అన్ని రంగాల్లో రాణించి బలోపేతం కావాలని మన ఆలోచన సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కటకం నర్సింగ్‌రావు అన్నారు. ఆదివారం మర్రిగూడ మండల కేంద్రంలో బీసీ మన ఆలోచన సాధన సమితి జెండాను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో వెనుకబడ్డారని అన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం మండల అధ్యక్షుడు కొండల్ ముదిరాజ్, మాజీ సర్పంచ్ నల్ల యాదయ్య, జింకల కొండల్, రవి, పగడాల రఘు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చెరువుల మరమ్మతులకు సన్నద్ధం



చండూరులో పుల్లాయి చెరువుకు నీరు చేరే ఫీడర్ చానల్



గట్టుప్పల్‌లో కంపచెట్లు కమ్మేసిన చక్రాయి చెరువు కట్ట

- గట్టుప్పల్ మండలంలో 5, చండూరులో 3 చెరువులకు నిధులు విడుదల
- వారం రోజుల్లో పనులు ప్రారంభం
- చెట్ల తొలగింపు, కట్టల బలోపేతంపై ప్రత్యేక దృష్టి

గట్టుప్పల్ : చెరువుల్లో నీరు పుష్కలంగా నిల్వ ఉంటేనే పంటలకు సాగు నీరు అందించొచ్చు. అదే విధంగా భూగర్భ జలాలు పెరిగి బోర్లు నీళ్లు సంవృద్ధిగా పోస్తాయి. అలాంటి చెరువులకు గండ్లు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంది. గత వానాకాలం సీజన్‌లో చండూరు, గట్టుప్పల్ మండలాల్లో అనేక చెరువులకు గండ్లు పడితే తాత్కాలికంగా రైతులు ఆ గండ్లను గడ్డి, రాళ్లతో మూసివేశారు. కాగా వానలు రాకముందే చండూరు, గట్టుప్పల్ మండలాల్లో చెరువులకు మరమ్మతులు చేపట్టేందుకు అధికారుల సమాయత్తమవుతున్నారు. ఇందుకుగాను గతంలో వరదలకు గండ్లు పడి అభివృద్ధికి నోచుకోని చెరువులను ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపగా.. ప్రభుత్వం నిధులను సైతం విడుదల చేసింది. మరో వారంలో పనులు ప్రారంభించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు.

రెండు మండలాలు.. 8 చెరువులు..

ఉమ్మడి చండూరు మండలానికి సంబంధించి 8 చెరువులకు మరమ్మతులు చేయాలని అధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఇందుకు గాను నిధులు సైతం విడుదలయ్యాయి. ఈ నిధులతో చెరువు కట్టలపైన, చెరువుల లోపల కంపచెట్ల తొలగింపు, కట్టలను బలోపేతం చేయడం చేస్తారు. గట్టుప్పల్ మండల పరిధిలో 5 చెరువులు ఉన్నాయి. వెల్మకన్నె కింది కుంటకు రూ.9.20 లక్షలు, వెల్మకన్నె నర్సయ్యకుంటకు రూ.30.05 లక్షలు, తేరట్‌పల్లి మొండి కట్టల కుంటకు రూ.7.5 లక్షలు, గట్టుప్పల్ చక్రాయి చెరువుకు రూ.10.70 లక్షలు, నామాపురం కోమటి కుంటకు రూ.9.75 లక్షలు, చండూరు మండలంలోని పుల్లయ్య చెరువుకు (చెరువు పనులు, ఫీడర్ చానల్ రిపేరు) రూ.27.16 లక్షలు ఉడతలపల్లి ఊర చెరువు ఫీడర్ చానల్ రిపేరుకు రూ.10.55 లక్షలు, ఉడతలపల్లి ఊరచెరువు మరమ్మతులకు రూ.7.10 లక్షలు మంజూరయ్యాయి. చెరువుల మరమ్మతు పనులు వారం రోజుల్లో ప్రారంభం కానున్నాయని ఐబీ జేఈ భాగ్యలక్ష్మి, ఏఈ రఘు తెలిపారు.

ఇప్పటికే మరమ్మతులు చేయాల్సింది



వానాకాలం సీజన్ ప్రారంభం అయ్యింది. ఇప్పటికే చెరువులకు మరమ్మతులు చేయాల్సి ఉండే. భారీ వర్షాలకు అనేకమార్లు చక్రాయి చెరువుకు గండి పడింది. ముందస్తుగా పనులు చేయిస్తే నీరు కుంటలో నిల్వ ఉంటుంది. అధికారులు త్వరగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలి.

–నల్లవెల్లి మల్లేశం, రైతు, గట్టుప్పల్

కాలయాపన చేయకూడదు



వర్షాలు రాకముందే చెరువు మరమ్మతు పనులు మొదలుపెట్టాలి. టెండర్ ప్రక్రియ పేరుతో కాలయాపన చేయకూడదు. భారీ వర్షాలు వస్తే చెరువు కట్టలకు ప్రమాదం పొంచి ఉంది. చెరువుల మరమ్మతు పనులకు అధికారులు తొందరగా చర్యలు తీసుకోవాలి.

– కర్నాటి మల్లేశం, గట్టుప్పల్

చెరువులు నింపాలి



వర్షం నీరు వృథా కాకుండా చెరువులను నింపడంపై అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలి. వానా కాలం సీజన్‌లో రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలి. మొదటగా గండ్లు పడి ప్రమాదకరంగా ఉన్న చెరువులను అభివృద్ధి చేయాలి. తర్వాత అన్ని చెరువులను అభివృద్ధి చేయాలి.

–అనంత చంద్రశేఖర్, చండూర్

పేదల సంక్షేమానికి కేంద్రం కృషి



మాట్లాడుతున్న భాస్కర్‌నాయక్

మర్రిగూడ: దేశంలోని పేద ప్రజల సంక్షేమానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కృషి చేస్తోందని బీజేపీ గిరిజన మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు కొర్ర భాస్కర్ నాయక్ అన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటై 11 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా మర్రిగూడ మండలంలోని రాజాపేటతండాలో నిర్వహించిన రచ్చబండ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఆపరేషన్ సిందూర్ విజయంతో దేశ దౌత్య సామర్థ్యం మరోసారి నిరూపితమైందన్నారు. ప్రధాని మోదీ నాయకత్వంలో దేశ ప్రతిష్ఠ అంతర్జాతీయంగా పెరిగిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలన్నారు. అర్హులైన పేదలందరికీ ఇళ్లు, రేషన్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లి బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపించేందుకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పిట్టల శ్రీనివాస్, బీజేపీ మండల అధ్యక్షుడు రాజేందర్‌నాయక్, గిరిజన మోర్చా మండల అధ్యక్షుడు ఆంగోతు భాస్కర్‌నాయక్, నాయకులు గ్యార గోపాల్, కటకం నరసింహ, చాపల వెంకటేష్, రాకొండ ప్రదీప్‌రెడ్డి, రమావత్ చంద్రకళ, రమావత్ ప్రసాద్, జటావత్ దత్తు, రమావత్ శేషు, ఆంగోతు హరి, రమావత్ ఆకాశ్, చందర్, దిలీప్ పాల్గొన్నారు.

సహకార సంఘం భవనానికి నూతన శోభ



మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం

మునుగోడు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయం పక్కనే ఉన్న మునుగోడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం భవనం నూతన శోభను సంతరించుకుంది. ఆరు నెలల క్రితం వరకు పాడుబడిన బంగ్లాలా ఆ భవనం ఉండేది. సంఘం పాలకవర్గ సభ్యులు సమావేశాలు నిర్వహించుకునేందుకు అవసరమైన సమావేశ మందిరం కూడా చిన్నగా ఉండే. అంతేకాకుండా ఎరువులు, విత్తనాలు నిల్వ చేసేందుకు గోదాం కూడా చిన్నగా ఉండేవి. సమస్యను తెలుసుకున్న ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి సంఘంలోని నగదు రూ.48 లక్షలు ఖర్చుచేసి అదనపు గోదాములతోపాటు పాలకవర్గ సభ్యుల సమావేశానికి అనువుగా విశాలంగా భవనంపైన అంతస్తు నిర్మించారు. అందులో కుర్చీలతోపాటు ఇతర సౌకర్యాలు కల్పించారు. భవనానికి కొత్తగా రంగులు వేయించారు. దీంతో ఆ భవనం నూతన కల సంతరించుకుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



రామగిరి(నల్లగొండ): సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, అధ్యాపకులు

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణంలోని మమత హైస్కూల్‌లో 1991–92 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ భవన్‌లో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. కార్యక్రమంలో మమత హైస్కూల్ కరస్పాండెంట్ యానాల ప్రభాకర్‌రెడ్డి, పూర్వ విద్యార్థులు రెడ్డిపల్లి గిరి, నామిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, శ్రీపతి యాదయ్య, మహమ్మద్ కవి, ఓర్సు వెంకటేశ్వర్లు, వరంగల్ కృష్ణ, సుభాష్‌రెడ్డి, రబ్బాని, రాజేందర్‌రెడ్డి, అంశాల సత్యనారాయణ, రజని, జ్యోతి, నిర్మల, కవిత, పెద్ది శ్రీనివాస్, మమత హైస్కూల్ ఉపాధ్యాయులు ఎండీ సలీం, ప్రతాపరెడ్డి, వెంకటరామిరెడ్డి, దాడి చంద్రశేఖర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, యానాల రాధిక, దొడ్డి రామ్మూర్తి, దాడి సుధాకర్‌రెడ్డి, ఊట్కూరు మధుసూదన్‌రెడ్డి పాల్గొన్నారు.

నకిరేకల్ జెడ్పీ హైస్కూల్‌లో

నకిరేకల్ : పట్టణంలోని జెడ్పీ హైస్కూల్‌లో 2008–09 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఈసందర్భంగా అప్పటి హెచ్‌ఎం పోతుల రామచంద్రయ్య, ఉపాధ్యాయ బృందాన్ని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు దూరపల్లి నాగరాజ్, శ్రవణ్, రామకృష్ణ., విజయ్, శ్రీకాంత్, ఉమారాణి, రేణుక, మేడి ప్రియదర్శిని తదితరులు పాల్గొన్నారు.



నకిరేకల్ : సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నేడు రైతు నేస్తం కార్యక్రమం

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల, పామనగుండ్ల, కట్టంగూర్ గ్రామాల్లో గల రైతు వేదికల్లో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు రైతు నేస్తం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏఓ గిరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులతో మాట్లాడతారని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులు, మాజీ ప్రజాప్రతినిధులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నార్కట్‌పల్లి మండలంలో..

నార్కట్‌పల్లి : మండల కేంద్రంలోని రైతు వేదికలో సోమవారం నేస్తం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్వరరావు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. పంటల సాగులో ఆధునిక మెళకువలు నూతన సాంకేతిక విధానాలపై శాస్త్రవేతలు అధికారులు పలు సూచనలు సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని అక్కెనపల్లి, నక్కలపల్లి, చిప్పలపల్లి, సబ్బిడిగూడెం, చిన్నతుమ్మలగూడెం రైతులు రైతు వేదికల్లో రైతు నేస్తం కార్యక్రమలో పాల్గొనాలని కోరారు.

పచ్చడి మామిడికి భలే గిరాకీ



మామిడికాయలు కొంటున్న మహిళలు



మామిడికాయలను కట్ చేస్తున్న యువకుడు

నకిరేకల్ : పట్టణంలో ఆదివారం నిర్వహించిన సంతకు పచ్చడి మామిడికాయలు భారీగా వచ్చాయి. జిల్లాలోని చండూరు, నల్లగొండ, సూరారం, ఆత్మకూర్ ఎస్, గోపలాయిపల్లి తదితర ప్రాంతాల నుంచి వ్యాపారులు పచ్చడి కాయలను తెచ్చి సంతలో విక్రయించారు. నకిరేకల్, శాలిగౌరారం, కేతేపల్లి మండలాల నుంచి గ్రామీణులు అధికంగా వచ్చి పచ్చడి కాయలను కొనుగోలు చేయడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు సంత మామిడి కాయల వ్యాపారులు, కొనుగోలుదారులతో కళకళలాడింది. ఒక్కో మామిడికాయ పరిమాణాన్ని బట్టి నాలుగు రూపాయల నుంచి 20 రూపాయల వరకు విక్రయించారు. సంతలో కొనుగోలు చేసిన మామిడి కాయలను కట్ చేసే వారు కూడా అందుబాటులో ఉండి ఒక్కో కాయకు సైజ్ ను బట్టి రూ.3 నుంచి 5 వరకు తీసుకుని కట్ చేసి ఇచ్చారు. పచ్చళ్లు పెట్టే సమయం మించిపోతోందని ప్రజలు ఎక్కువ సంఖ్యలో కొనుగోలు చేశారు.

దళితులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నర్సింహ

మునుగోడు: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో దళితులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ఇన్‌చార్జ్ బొల్లూరి నర్సింహ కోరారు. ఆదివారం మునుగోడులోని సీపీఐ కార్యాలయంలో జరిగిన దళితుల హక్కుల పోరాట సమితి మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ సబ్‌ప్లాన్ పకడ్బందీగా అమలుచేసి దళితుల ఆర్థిక అభివృద్ధికి తోడ్పడాలని కోరారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేసి రిజర్వేషన్లు రద్దుచేసే కుట్ర చేస్తోందని, దానిని తిప్పికొట్టేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా కన్వీనర్ గోసుకొండ లింగయ్య, నందిపాటి అశోక్, సీపీఐ మండల కార్యదర్శి చాపల శ్రీను. బోయపర్తి యాదయ్య, పందుల కుమార్, మేడి చంద్రయ్య, ఏర్పుల నగేష్, గోసుకొండ మారయ్య, దుబ్బ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కన్నా .. నీవే నాలోకం



ఫాదర్స్ డే సందర్భంగా నల్లగొండ పట్టణంలోని రాంనగర్ పార్కులో ఆదివారం ఓ తండ్రి తన చిన్నారిని ఆడిస్తున్న దృశ్యం

రైతుల శ్రమదానం



శ్రమదానం చేస్తున్న రైతులు

తిప్పర్తి : మండలంలోని జొన్నగడ్డలగూడెం గ్రామంలో రైతులు ఆదివారం శ్రమదానం చేశారు. జొన్నగడ్డలగూడెం గ్రామం నుంచి వెలుగుపల్లి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా ఉన్న కంపచెట్లను మూడు కిలోమీటర్ల మేర తొలగించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ కొంతకాలంగా రోడ్డుకు ఇరువైపులా కంపచెట్లు ఉండడంతో ఆ దారిగుండా వెళ్లడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ దారి మొత్తం చెట్లతో కమ్ముకుని పోవడంతో ప్రయాణించాలంటే ఇబ్బందులు ఎదురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో నామ మారయ్య, డేవిడ్ రాజు, పరమేష్, రజిని, అవృతయ్య, యాదగిరి, దేవదాసు, పర్వతాలు పాల్గొన్నారు.

దోపిడీ రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం



మాట్లాడుతున్న సుధాకర్‌రెడ్డి

నల్లగొండ టౌన్: దోపిడీ రహిత సమాజ నిర్మాణమే సీపీఎం లక్ష్యమని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు. ఆదివారం నల్లగొండ పట్టణంలో సీపీఎం నల్లగొండ నియోజకవర్గస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం రైతాంగానికి కనీస మద్దతు ధర చట్టం చేస్తామని హామీ ఇచ్చి అమలు చేయడం లేదన్నారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు బుర్రి ప్రసాద్, పిట్టల రవి, సీపీఎం పట్టణ కార్యదర్శి దండంపల్లి సత్తయ్య, సయ్యద్ హాశం, పాలడుగు నాగార్జున, పాలడుగు ప్రభావతి, ఎండీ సలీం, కొండ అనురాధ, నలపరాజు సైదులు, మన్నెం భిక్షం, కానుగు లింగస్వామి, పుల్లెంల శ్రీకర్ తదితరులు పాల్గొన్నారు.

కల్నల్ సంతోష్‌బాబుకు నివాళి



నివాళులర్పిస్తున్న నాయకులు

నకిరేకల్ : పట్టణంలోని మెయిన్ సెంటర్‌లో కల్నల్ సంతోష్‌బాబు 5వ వర్ధంతిని ఆదివారం బీజేపీ మండల, పట్టణ కమిటీ ఆధ్వర్యంలో జరుపుకున్నారు. సంతోష్‌బాబు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కల్నల్ సంతోష్‌బాబు దేశం కోసం పోరాడిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో బీజేపీ మండల, పట్టణ అధ్యక్షులు బుడిగె సైదులు, గర్రె మురళీమోహన్, నాయకులు వీర్లపాటి జానయ్య, గుడుగుంట్ల సాయన్న, మాచర్ల సైదులు, బ్రహ్మదేవర రవిశంకర్, రవి, సైదిరెడ్డి, జానయ్య, విక్రమ్‌రెడ్డి, గీసుకొండ రమేష్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జరిమానాలు విధించినా మారని తీరు

మునుగోడు: మండల కేంద్రంలోని రోడ్లపై, మురికి కాల్వల్లో చెత్త పడేస్తే గ్రామ పంచాయతీ అధికారులు జరిమానాలు విధిస్తున్నారు. అయినా ప్రజల్లో ఎలాంటి మార్పు రావడం లేదు. యథేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లు వినియోగించడంతోపాటు హోటల్‌లో టీ తాగి పడేసిన గ్లాసులు, ఇతర చెత్తను మురికి కాలువల్లో వేస్తున్నారు. దీంతో ఆ కాల్వల్లో నీరు పారకుండా నిల్వ ఉండి దుర్వాసన వెదజల్లుతోంది. అధికారులు అడపాదడపా తనిఖీలు చేసి జరిమానాలు విధించడం వల్లే భయం లేకుండా పోయిందని, కనీసం వారంలో మూడుమార్లు అయినా పరిశీలించి చర్యలు తీసుకుంటే మార్పు వస్తుందని పలువురు పేర్కొంటున్నారు.



మురికి కాల్వలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు, చెత్త

ఉత్తమ ఫలితాలకు కేరాఫ్ మునుగోడు గురుకులం

- గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో వంద శాతం ఫలితాలు
- మండల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు కైవసం



మునుగోడులోని జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాల

మునుగోడు: మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల బాలికల గురుకుల పాఠశాల ఉత్తమ ఫలితాలకు కేరాఫ్‌గా నిలుస్తోంది. ఈ ఏడాది వెలువడిన పదో తరగతి ఫలితాల్లో ఈ పాఠశాల నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించింది. ఆ పాఠశాలలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడంపై మునుగోడు మండలంలోని ప్రజలు, ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

75కు 75 మంది ఉత్తీర్ణత

మునుగోడు మండల కేంద్రంలోని కమ్మగూడెంలో ఓ అద్దె భవనంలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిరావు పూలే వెనుకబడిన తరగతుల గురుకుల పాఠశాలలో ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు మొత్తం 480 మంది విద్యార్థినులు విద్యనభ్యస్తున్నారు. అందులో 2024–25 విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులు మొత్తం 75 మంది పరీక్షలు రాయగా అందరూ ఉత్తీర్ణత సాధించారు. ఆ పాఠశాల విద్యార్థులు మండలంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. అందులో గ్యార పూజిత 573 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలువగా, ఆవుల తేజస్విని 571 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచింది. వీరితో పాటు బి.దీపిక, డి.వైష్ణవి 564 మార్కులు సాధించి తృతీయ స్థానంలో నిలిచారు. దీంతో ఆ విద్యార్థినులకు పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను విద్యార్థినుల తల్లితండ్రులు అభినందిస్తున్నారు. ప్రతి ఏడాది పాఠశాలలో ఇదే స్ఫూర్తితో ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నారు.

ఉపాధ్యాయులు ప్రోత్సాహం అందించారు



పదో తరగతిలో మంచి మార్కులు సాధించేందుకు మా ఉపాధ్యాయులు ఎంతో ప్రోత్సహించారు. రోజువారీ తరగతులతోపాటు ఉదయం, మధ్యాహ్నం సాయంత్రం స్టడీ అవర్స్ నిర్వహించేవారు. ప్రతిరోజూ పరీక్షలు పెట్టేవారు. దీంతో నేను 573 మార్కులు సాధించగలిగాను.

–గ్యార పూజిత, మునుగోడు గురుకుల పాఠశాల

ప్రత్యేక తరగతులు నిర్వహించాం

పదో తరగతి పరీక్షల ఫలితాల్లో నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతిరోజు ప్రత్యేక తరగతులు నిర్వహించాం. సాధారణ తరగతులతోపాటు ఉదయం 5 గంటల నుంచి 8.30గంటల వరకు, మధ్యాహ్నం 2.30 నిమిషాల నుంచి 4.30 నిమిషాల వరకు, రాత్రి 7 గంటల నుంచి 10 గంటల వరకు ప్రతిరోజు ఒక సబ్జెక్ట్ టీచర్‌తో స్టడీ అవర్స్ నిర్వహించాం. డిసెంబర్ మాసం నుంచి ప్రతి రోజు పరీక్షలు పెట్టి ఎవరైనా వెనుకబడితే వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చదివించేవాళ్లం.

–సంధ్యారాణి, పాఠశాల ప్రిన్సిపాల్